నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- తెనాలి పట్టణం, మండల పరిధిలో 16 కేంద్రాలు
- హాల్‌టిక్కెట్ల బోర్డులు, బల్లలపై నంబరు స్టిక్కర్ల ఏర్పాటు..

తెనాలిఅర్బన్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 18వ తేదీ వరకు జరగనున్నాయి. తెనాలి పట్టణ, మండల పరిధిలోని 16 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వాటిలో 3,311 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రం లోనికి అనుమతించనున్నట్లు తెలిపారు. 9.31వ నిమిషం నుంచి ఎవరిని అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పంపిణీ చేయడంతో పాటు పరీక్ష కేంద్రాలను పరిశుభ్రపరిచారు. హాల్ టిక్కెట్ నంబర్ల ఆధారంగా గదుల వివరాలు తెలియజేసే బోర్డులు బయట ఏర్పాటు చేశారు. బల్లలపై హాల్ టిక్కెట్ నంబర్లు ఉన్న స్టిక్కర్లను అంటించారు.

ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లు చూపించి, ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించవచ్చు. ఆర్టీసీ అధికారులకు ఈ మేరకు ఆదేశాలను జారీ చేసింది.

పరీక్ష కేంద్రాల్లో సర్వం సిద్ధం..

పదో తరగతి విద్యార్థులపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆదివారం కూడా వారికి ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ హవర్స్ నిర్వహించారు. పరీక్షలకు సన్నద్ధం చేశారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో హాల్ టిక్కెట్ నంబరు స్టిక్కర్లను బల్లలపై అంటించారు. గదుల వివరాలు తెలియజేసే బోర్డులు కేంద్రాల బయట ఏర్పాటు చేశారు. తాగునీటి వసతి కల్పించారు. పరీక్ష కేంద్రం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.



కొత్తపేట బాలికోన్నత పాఠశాలలో పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు



బల్లలపై హాల్ టిక్కెట్ నంబర్ స్టిక్కర్ అంటిస్తున్న ఉపాధ్యాయుడు

ఒత్తిడొద్దు..ప్రశాంతంగా పరీక్షలు రాయండి



పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నాం. ఉదయం 8.30గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తాం. 9.30 గంటల దాటిన తరువాత ఎవరినీ అనుమతించాం. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి, ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

– మేకల లక్ష్మీనారాయణ, ఎంఈఓ, తెనాలి

పరీక్ష కేంద్రాల వివరాలు

పరీక్ష కేంద్రం	విద్యార్థుల సంఖ్య
1. జెడ్పీహెచ్ఎస్ (సంగం జాగర్లమూడి)	294
2. జెడ్పీహెచ్ఎస్ (కొలకలూరు)	164
3. జెడ్పీహెచ్ఎస్ (పెదరావూరు)	204
4. దొడ్డపనేని మున్సిపల్ బాలికోన్నత, తెనాలి	180
5. రావి సాంబయ్య మున్సిపల్ బాలుర, తెనాలి	235
6. తాలూకా జూనియర్ కాలేజ్, తెనాలి	145
7. సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్, తెనాలి	225
8. ఎన్ఎస్ఎస్ఎం హై స్కూల్, తెనాలి	215
9. తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్, తెనాలి	115
10. భాష్యం హైస్కూల్, తెనాలి	220
11. ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు మీడియం స్కూల్, తెనాలి	220
12. శ్రీ చైతన్య హైస్కూల్, దేవిచౌక్, తెనాలి	215
13. కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్, తెనాలి	259
14. ఎన్‌సీఆర్ఎన్ఎంహెచ్ స్కూల్, తెనాలి	247
15. ఆదర్శ స్కూల్, తెనాలి	252
16. వీఎస్సార్ జేడీఎం జెడ్పీహైస్కూల్ (అంగలకుదురు)	121

క్లుప్తంగా

తెనాలి ప్రయాణికులకు బంపర్ ఆఫర్

ఇంద్ర బస్సుల్లో పది శాతం రాయితీ



తెనాలిఅర్బన్: తెనాలి డిపో నుంచి హైదరాబాద్, విశాఖపట్నం వెళ్లే ఇంద్ర బస్సుల్లో పది శాతం చార్జీ రాయితీ ఇస్తున్నట్లు తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు రాయితీ కొనసాగుతుందన్నారు. హైదరాబాద్, విశాఖపటంం నుంచి ఇంద్ర బస్సుల్లో తెనాలి వచ్చినా.. ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

తాడేపల్లి రూరల్: నగర పరిధిలోని మెల్లెంపూడిలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో గర్భిణులకు న్యూట్రిషన్, ప్రోటీన్ ఫుడ్ సప్లిమెంట్స్ అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ రీజనల్ చైర్మన్ పబ్లిక్ ఇజేమ్ యలమంచిలి వేణుగోపాల్ జన్మదినం సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. అనంతరం గ్రామ వికాస్ ప్రాజెక్ట్ ఏరియా చైర్మన్ కొల్లా శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కోశాధికారి శెట్టి రామకృష్ణ, సభ్యులు ఓబులారెడ్డి, సుకుమార్ రెడ్డి, శెట్టి కేశవరావు, రవీంద్రారెడ్డి, నాగ కిరణ్, శ్రీను, ఆర్‌సిసి మెంబర్స్ పున్నారెడ్డి, వెంకటప్పరెడ్డి, టి. పుష్పరాణి, షేక్ సుల్తానా పాల్గొన్నారు.



విజయకీలాద్రిపై వైభవంగా తిరుమంజన సేవ



తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం ధనలక్ష్మి, సంతాన లక్ష్మి అమ్మవార్లకు తిరుమంజన సేవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు 10 గంటలకు అష్టలక్ష్మి సమేత లక్ష్మీ నారాయణ స్వామి వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ధనలక్ష్మి, సంతానలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు జరిపారు. 10 గంటలకు తొమ్మిది సన్నిధులలో గులాజీ పుష్పాలతో సహస్రనామార్చన, కుంకుమార్చన కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద నివేదన గావించారు. కార్యక్రమంలో జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రాఘవాచార్యులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి దేవాలయ పునః నిర్మాణం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం పునః నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 1975వ సంవత్సరంలో వెలసిన శ్రీ మహంకాళి అమ్మవారం ఆలయం అర్ధ శతాబ్దం తరువాత పూర్తిస్థాయిలో జీర్ణోద్ధరణ జరుగనుందని, సుమారు కోటి రూపాయలు దేవదాయధర్మాదాయ శాఖ వారి సీజీఎఫ్ నిధులు, ఇతర దాతల సహకారంతో త్వరలో పనులు ప్రారంభించనున్నారని అన్నారు. దాతలు దొంతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మారెల్ల పుల్లారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఐదు నెలలకాల వ్యవధిలో ఈ ఆలయ పునః నిర్మాణ పనులు పూర్తిచేసి ఆలయ ఖ్యాతిని మరింత పెంచనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు ముఖ్య సంఘ కాపరుల సమావేశం

వీర్లపాలెం(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం యేసునామ క్షేత్రంలో ముఖ్య సంఘ కాపరుల ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పాస్టర్స్ ఫెలోషిప్ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళపై దాడి

గుంటూరు ఈస్ట్: మహిళపై ఇద్దరు దాడి చేసిన ఘటనపై ఆరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నాయుడుపేటకు చెందిన కల్యాణి, ఆమె తమ్ముడు సాయి పాత కక్షల నేపథ్యంలో గతనెల 30న దరియాబీపై దాడి చేశారు. ఆమె మెడలోని బంగారు గొలుసు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. దరియాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారామ మందిరంలో అన్నదానం

తెనాలిటౌన్: శ్రీరామ నవమి వసంత నవరాత్రులు ముగింపు సందర్భంగా హనుమాన్ చౌక్‌లోని శ్రీ సీతారామ మందిరం వద్ద ఆదివారం అన్నదానం జరిగింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీతారామ మందిరంలో పూజలు నిర్వహించారు. సహకార బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు బాలాజీ ప్రసాద్, బ్యాంకు సీఈవో టి.కృష్ణవేణి, నాబార్డు డీడీఎం కార్తిక్, అన్నదాన కమిటీ చైర్మన్ పిన్నిక శేషభానురావు, బ్యాంకు ఆఫీసర్ ప్రత్తిపాటి రమేష్, దుగ్గిరాల చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, బ్యాంకు అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, రామాంజనేయులు

సినీ రంగ అభివృద్ధికి..ఎన్టీఆర్ కృషి మరువరానిది

తెనాలిఅర్బన్: సినీ రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వ్యక్తులలో ఎన్‌టీ రామారావు ఒకరని ఆళ్ళ నాగేశ్వరరావు, పరుచూరి రమ్య కొనియాడారు. ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేటలోని పెన్షనర్ హాల్‌లో ఎన్‌టీఆర్ వ్యక్తిత్వంపై ఆదివారం సాయంత్రం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ నృత్య కళాకారిణి మన్నె టీనా చౌదరితో పాటు వక్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శత జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వర రావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, వేములపల్లి మల్లికార్జునరావు, వెలగా సుభాష్ చంద్రబోస్, కనపర్తి మధుకర్, పినపాటి సురేష్, బొల్లినేని జ్యోతి, గడ్డిపాటి సీతారత్నం, మన్నె సత్యనారాయణ, శివకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



టీనా చౌదరి, నాగేశ్వరరావు, రమ్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సరస్వతీ మాత విగ్రహాల ఆవిష్కరణ

నెహ్రూనగర్: వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలు, కావటి శంకరరావు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో ఆదివారం వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు ఏర్పాటు చేసిన విగ్రహాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ మణికంఠ గుంటూరు, మహిళా శక్తి గుంటూరు సభ్యులు నగరంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, భవిష్యత్‌లో మరిన్ని ప్రజా ఉపయోగకరమైన పనులు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు గోనుగుంట్ల జయంత్ కుమార్, గిరిజా శాంత ప్రసాద్, బోలిశెట్టి వెంకటేశ్వరరావు, జుజ్జూరి శ్రీనివాసరావు, మాజేటి మణికంఠ ప్రసన్న, మాజేటి స్వాతి, పారేపల్లి శ్రీనివాసరావు, పారేపల్లి మంజుల, పోలిశెట్టి నాగరాజు, పోలిశెట్టి దుర్గాభవాని, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పోతురాజు సమత, వేములపల్లి జ్యోతి పద్మజ, నిమ్మల వెంకటరమణ, గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా

వైభవంగా లేమల్లె శ్రీలక్ష్మీ అమ్మవారి వార్షికోత్సవం

అమరావతి: మండల పరిధిలోని లేమల్లెలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు దేవాలయంలో అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వేకువజాము నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తుల రాకతో దేవాలయ ప్రాంగణం కళకళలాడింది. శ్రీలక్ష్మీ అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాతసేవ అనంతరం అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. తొలుత గణపతి పూజ అనంతరం శ్రీలక్ష్మీ అమ్మవారికి భక్తులతో సహస్రనామాలతో కుంకుమ పూజ చేశారు. అమ్మవారి ప్రతినిధిగా గౌరవం పొందుతున్న నాగూర్‌బీ భక్తులకు కుంకుమ దిద్ది ప్రసాదాలను అందజేశారు. అమ్మవారి ప్రభను గ్రామంలో ఊరేగించారు. మాస్టర్ తుళ్లూరు సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సుమారు ఐదువేల మందికి అన్నదానం నిర్వహించారు.

నాయకర్ సిద్ధాంతాలు దేశానికి అవసరం

పాత గుంటూరు: ప్రస్తుతం దేశ సాంస్కృతిక రంగంలో అవాంఛనీయ పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు పెరియార్ రామస్వామి నాయకర్ సిద్ధాంతాలు ఎంతో అవసరమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న గుంటూరులోని రెవెన్యూ భవనంలో పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బ్రాడీపేటలోని ఒక హోటల్‌లో ఆదివారం సభ ఆహ్వాన పత్రికను డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.విల్సన్, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి సంస్థ సభ్యుడు అలోకం పెద్దబ్బాయి, జొన్నలగడ్డ రామారావు, ఎస్.ఎం.సుభాని, నరసింహారావు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు

స్వర్ణోత్సవ కలయిక



పెదవడ్లపూడి(మంగళగిరి): కళ్లలో శుక్లపు పొరలు కంటి చూపునకు అడ్డుపడుతున్నా.. వారి కనుపాపల్లో ఆనంద జ్యోతులు వెలిగాయి. ఆ నడకల్లో సత్తువ మందగించినా.. ఆ వేదిక తాకగానే వారి పాదాలు నాట్యమాడాయి. తాతా అని పిలుపునకు చేరువైనా.. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆ హృదయాలు 50 ఏళ్లు వెనక్కి నెట్టాయి. ఏరా నాగేశ్వరరావు ఎన్నేల్లయింది నిన్ను చూసి.. బాగున్నావా.. పిల్లలు ఏమి చేస్తున్నారు.. మన స్నేహితులందరూ వచ్చారా.. వాడు సుబ్బారావు కదరా బాగా మారిపోయాడు.. నువ్వు మాత్రం మారలేదురా.. అంటూ తమ చిన్న నాటి స్నేహాలను అనుబంధాలతో పాటు చిలిపి పనులను గుర్తు చేసుకున్నారు. తమ చదువుల గుడికి దాతృత్వపు హారం వేసిన అపూర్వ ఘట్టాలు పెదవడ్లపూడి జెడ్పీ పాఠశాలలో ఆదివారం ఆవిష్కృతమయ్యాయి. 1972–73 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సవాల మధ్య జరిగింది. 135 మందిలో 65 మంది హాజరు కాగా 23 మంది మృతి చెందారు. వివిధ కారణాలతో 47 మంది వివిధ కారణాలతో హాజరుకాలేకపోయారు. వివిధ రంగాలలో స్థిరపడిన ప్రముఖులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు అన్నే చంద్రశేఖర్, బొర్రా సుబ్బారావు, ఆనంద ప్రసాద్‌రెడ్డి,యేళ్ళ రాఘవయ్య, యశోద, ఆదిలక్ష్మి పర్యవేక్షించారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

- పట్టణంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో చిన్నారుల ప్రదర్శన
- యూదుల రాజు ఏసన్నా..నినాదాలతో ర్యాలీ

తెనాలిఅర్బన్: మట్టల ఆదివారం వేడుకలను తెనాలిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో చిన్నారులు పూలతో అలంకరించిన ఈత మట్టలను పట్టుకుని యూదుల రాజు హోసన్నా.. యూదుల రాజు ఏసన్న అంటూ నినాదాలు చేశారు. క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ ప్రదర్శనలు చేశారు. టబర్నికల్ ఆఫ్ గాడ్ చర్చి ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్, న్యూ జెరూషలేం ప్రార్థన మందిరం సంయుక్త ఆధ్వర్యంలో మారీసు పేటలో వేడుకలు నిర్వహించారు. మారీసుపేట, ఆర్ఆర్ఆర్ నగర్, ద్వారక నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ సొపాటి విజయ్ కుమార్, సిస్టర్ అత్తోట హేమలత మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు లోక రక్షకుడిగా భూమిపై జన్మించారని సందేశం ఇచ్చారు. ఆయనను హోసన్నా అంటూ ప్రజలు ఊరేగించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నలుకుర్తి కుమారి, యాజాల గాంధీ, జి.కోటేశ్వరరావు, దావులూరి నాగయ్య, నలుకుర్తి దేవరాజు, మేకల సురేష్, సొపాటి కిరణ్, పినపాటి వినయ్‌కుమార్, పినపాటి కొండలరాజు, ఏటుకూరి రాజ్‌కిషోర్, పినపాటి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

- బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మల్లెపాడు గ్రామంలో మట్టల ఆదివారం వేడుకలను నిర్వహించారు. చర్చి యువతీ, యువకులు, చిన్నారులు మట్టలు పట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. క్రైస్తవ గీతాలు ఆలపించారు. పాస్టర్ పినపాటి గంగారావు, సంఘ సభ్యులు ఏటుకూరి మధుబాబు, పినపాటి స్టీవెన్‌బాబు, పినపాటి రజేంద్రబాబు, వలివేటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.
- చినరావూరులోని లూథరన్ చర్చి ఆధ్వర్యంలో చిన్నారులు ఆ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించి, క్రైస్తవ గీతాలను ఆలపించారు. సండే స్కూల్ టీచర్లు పిల్లి ప్రేమరాజు, దీనమ్మ, పాస్టర్లు రెవరెండ్ దేవరపల్లి ఏసురత్నం, వై.లెనిన్‌బాబు, డి.సాల్మన్‌రాజు, ఎం.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.
- ఐతానగర్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో చిన్నారులు ఈత మట్టలను పట్టుకుని లింగారావు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. క్రైస్తవ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ తెనాలి డేవిడ్, సంఘ సభ్యులు తెనాలి ఆనంద్ కుమార్, కొమ్ము సతీష్, అత్తోట అమరేంద్ర, తెనాలి శాస్త్రి, నలుకుర్తి కన్నా, మల్లెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిటౌన్: చావావారి పాలెం గ్రామంలోని లూథరన్ చర్చిలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరిపారు. రెవరెండ్ పి.వరబాబు, దైవ సేవకురాలు పి.విజయశ్రీ, చిన్నారులు, సంఘస్థులు ఈత మట్టలతో చర్చి చుట్టూ ప్రదక్షిణ చేశారు. కొలకలూరులోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ సాగర్ థామస్ తంబి ప్రత్యేక దివ్య బలిపూజను నిర్వహించారు. చిన్నారులు, సిస్టర్స్, మహిళలు చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వాక్యోపదేశం చేసి, మట్టల ఆదివారం విశిష్టతను ఫాదర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపదేశి క్రీస్తురాజు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ నన్నెపాగ సురేష్ ప్రార్థనలు చేశారు. చర్చి ప్రెసిడెంట్ సుద్దపల్లి శరత్ వెంకయ్య, సెక్రటరీ కొలకలూరి రాజయ్య, కోశాధికారి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. ఆర్‌సీఎం, లూథరన్, బాప్టిస్టు చర్చిలలో వేడుకలు జరిపారు.



మారీసుపేటలో ఈత మట్టలతో చిన్నారులు



చావావారిపాలెం మట్టలతో ప్రదక్షిణ చేస్తున్న రెవరెండ్ వరబాబు, తదితరులు



చినరావూరు ర్యాలీలో పాల్గొన్న లూథరన్ చర్చి చిన్నారులు

కీళ్ల మార్పిడి ఆపరేషన్లపై అపోహలొద్దు

డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి



లక్ష్మీపురం: కీళ్ల మార్పిడి ఆపరేషన్లపై అపోహలు వద్దని, తీవ్రంగా మోకాళ్ల నొప్పులు ఉన్నవారు మిగతా జీవితాన్ని సౌకర్యవంతంగా గడిపేందుకు తప్పనిసరిగా ఆపరేషన్లు చేయించుకోవాలని సాయిభాస్కర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. బ్రాడీపేటలోని తాలుకా ఆఫీసు కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆవరణలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో 230వ ఆరోగ్య సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ అధిక బరువు, మారిన జీవన విధానంతో ఒత్తిడి, కాల్షియం లోపం, మధుమేహం రక్తపోటు వంటి కారణాలతో 50 ఏళ్లు దాటిన వారిలో కీళ్ల అరుగుదల ఉంటుందని తెలిపారు. సమస్యను గుర్తించేందుకు తప్పనిసరిగా ఎముకల వైద్యుల్ని సంప్రదించి నిర్ణీత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆపరేషన్ అంటే భయపడి నొప్పుల మాత్రల్ని పదేపదే వాడి మూత్ర పిండాలు, గుండె జబ్బులు, కాలేయం, జీర్ణ కోశ సమస్యల బారిన పడొద్దని చెప్పారు. ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న అశాస్త్రీయ పద్ధతులతో సమస్యను తీవ్రతరం చేసుకోవద్దని తెలిపారు. ఎముకల అరుగుదల మొదటి, రెండో దశల్లో వైద్యుల సూచనలతో వ్యాయామం, మందులు సరిపోతాయన్నారు. మూడు, నాలుగు దశల్లోనే శస్త్ర చికిత్స అవసరమని చెప్పారు. అనంతరం డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డితో పాటు ఆయన తండ్రి మల్లేశ్వరరెడ్డిని సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రభుదాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, కృష్ణయ్య, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సప్తశతి పారాయణం సకల పుణ్య ఫలప్రదం

పాత గుంటూరు: దేవీ సప్తశతి పారాయణ సకల పుణ్యాల్ని చేకూర్చి పెడుతుందని మహా సహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ తెలిపారు. సంపత్ నగర్ శ్రీ శారదా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో శ్రీ దేవీ సప్తశతిపై ఆదివారం ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. నాగఫణిశర్మ ప్రవచనం చేస్తూ దేవీ సప్తశతి అమ్మవారి శక్తికి నిదర్శనం అని వివరించారు. అమ్మవారి స్తుతులు, స్తోత్రాల్ని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు పాల్గొన్నారు.